

### కరెంట్ లేక ఖాళీగా..

వచ్చిన రిపేర్లు చేయలేక ఊరికే కూసోవాల్సిన రోజులు వచ్చినట్లని పిస్తుంది. టెక్నాలజీ పెరిగి స్మార్ట్ టీవీలు వచ్చినంక మామూలు టీవీలు చూసేటోళ్లు కరువైండ్రు. పల్లెటూళ్ల నుంచి వచ్చే పాత టీవీ రిపేర్ల గిరాకీతోనే మేం బతుకుతున్నం. కరెంట్ ఉంటేనే రిపేర్లు చేసుకుంటం. అది లేకపోతే ఏ పనీ చేయలేం. వచ్చిన టీవీకి ఏ సమస్య ఉందో తెలుసుకోవాలన్నా.. దానికి రిపేరు చేయాలన్నా కరెంట్ ఉంటేనే సాధ్యం. అలాంటిది ఊకె పోతుంటే వ్యాపారం ఎట్లా చేసుకుంటం. ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో అర్థమైతలేదు. పదేండ్లు కేసీఆర్ గవర్నమెంట్‌ల 24 గంటల కరెంట్ ఉండేది. ఎప్పుడు వచ్చినా టీవీలను అదేరోజు రిపేర్ చేసి ఇచ్చేవాళ్లం. ఇప్పుడేమో రిపేర్‌కు వచ్చిన టీవీలను రోజుల తరబడి షాపులోనే పెట్టుకోవాల్సి వచ్చింది. చిన్నషాపు కాబట్టి టీవీలను ఎక్కువ పెట్టుకోవడం కూడా కష్టమైతుంది. 24 గంటల కరెంటును కరెక్టుగా ఇస్తే బాగుంటది. కేసీఆర్ సారు కరెంటు విషయంలో బాగా చేసిండు. కరెంట్ పోతదనే ఆలోచన కూడా రాకుండా చేసిండు. తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని చెప్పిన నోళ్లను మూయించి నిరంతరం వెలుగిచ్చిండు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా దూరదృష్టితో ఆలోచించి 24 గంటల కరెంటు ఇస్తే బాగుంటది. ప్రజల గురించి ఆలోచించకుండా గత సర్కారుపై కక్ష సాధింపు రాజకీయాలు చేయడం ప్రభుత్వానికి మంచిది కాదు. ఎంత నష్టం జరిగిందనేది కాదు.. రాష్ట్ర ఆదాయం ఎలా పెంచాలనే దానిపై దృష్టి పెట్టాలి. అప్పుడే రైతులు, వ్యాపారులు సంతోషంగా బతుకుతరు.

*- రాము, టీవీ మెకానిక్, ఆత్మకూరు, వనపర్తి జిల్లా*





### కరెంట్ కష్టాలు మొదలైనయ్..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్ కష్టాలుండే. ఎప్పుడు వస్తుండెనో.. ఎప్పుడు పోతుండెనో తెలిసేది కాదు. రైతులు పొలాల వద్ద పంటలకు నీరు పారించేందుకు అర్ధరాత్రి పోయేటోళ్లు. కరెంట్ కోసం రైతులు పడిన తిప్పలు అన్నీ ఇన్నీ కావు. నాణ్యమైన కరెంట్ ఇచ్చేటోళ్లు కాదు. బోర్లు కాలిపోయి ఇబ్బంది పడిన పరిస్థితులు ఎన్నో.. కేసీఆర్ సీఎం అయ్యాక కొన్ని రోజులకే కరెంట్ కష్టాలు తగ్గినయ్. రాత్రి కాకుండా పగటి పూటనే పంటలకు నీళ్లు పారేలా కరెంట్ ఇచ్చిండు. నాణ్యమైన కరెంట్ సరఫరాతో బోర్లు కాలిపోవడం తగ్గిపోయింది. ఇప్పుడు మల్లా కరెంట్ కష్టాలు మొదలైనయ్. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో అర్థమైతలేదు.

*- వేణు, చిరు వ్యాపారి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా*



### గాలివానొస్తే కట్ చేస్తున్నరు..

యాసంగి పంటలకు సాగునీరు లేక ఇబ్బందులు పడినం. కేసీఆర్ ప్రభుత్వంలో కుంటలు, చెరువులు కళకళలాడుతూ కనిపించేవి. మండుటెండలో సైతం ఆరుతడి పంటలు సాగుచేసినం. దానికి తోడు 24 గంటలు కరెంటు ఉండేది. ఇప్పుడు చిన్న గాలొచ్చినా.. వానొచ్చినా.. వెంటనే కరెంట్ కట్ చేస్తున్నరు. యాసంగిలో ఎకరం వరి నాటు వేస్తే బోర్లు అంతంత మాత్రంగానే నీళ్లు పోస్తున్నయి. కరెంట్ సక్రమంగా లేక ఎకరం పంట ఎండిపోయింది.

*- రాఘవేందర్‌యాదవ్, యువ రైతు, బొమ్మరాజుపల్లి, ఊర్కొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

# నాడు నిరంతరం..
# నేడు ఆగమాగం

- ఎటు చూసినా విద్యుత్ కోతల ముచ్చట్లే..
- చిన్న వానకు కూడా కట్‌కట
- కేసీఆర్ ఉన్నన్ని రోజులు కరెంట్ బాధలు తెల్వలే
- మళ్లీ పాత రోజులు వచ్చేటట్లున్నయ్..
- గోసపడుతున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులు

ఉమ్మడి పాలనలో అరకొర కరెంట్ సరఫరాతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. రైతులు రాత్రిపూట బావుల వద్ద కరెంట్ కోసం నిద్రాహారాలు మాని కండ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూసేవాళ్లు. చిరువ్యాపారులు దుకాణాలను బంద్ పెట్టుకునేవారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ కష్టాలన్నీ తీరాయి. రాత్రింబవళ్లు కట్‌లు లేకుండా నిరంతర విద్యుత్ అందించారు. ఆయన ఉన్నన్ని రోజులు కరెంట్ బాధలు లేకుండా చేశారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. ఎక్కడ చూసినా కరెంట్ కోతల మాటలే వినిపిస్తున్నాయి. చిన్న వానకు కూడా కరెంట్ పోతున్నది. నాడు నిరంతర వెలుగులు ఉంటే.. నేడు ఆగమాగం అవుతున్నామంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ కాంగ్రెస్ సర్కారు పాలన వద్దు బాబోయ్ అంటూ మొరపెట్టుకుంటున్నారు.

*- మహబూబ్‌నగర్, జూన్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### కేసీఆర్‌ను ప్రశ్నించడం సరికాదు..



కరెంట్ కష్టాలు తీర్చి రైతులకు ఎంతో మేలు చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 3 గంటల కరెంటిస్తే గగనం. మళ్లీ కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి మాకు వెన్నుదన్నుగా నిలిచిండు. సీమాంధ్ర పాలనలో రాత్రి వేళల్లో బోర్ల వద్ద పడుకొని పాముకాట్లకు ఎంతోమంది చనిపోయారు. రోడ్లెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసేటోళ్లం. కేసీఆర్ సీఎం అయ్యాక కంటినిండా నిద్రపోతున్నాం. కరెంట్ విషయంలో కేసీఆర్‌ను నిలదీయడం సరికాదు.

*- వెంకటయ్య, రైతు, కుప్పగండ్ల, వెల్దండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*



### మోటర్లకు రిపేర్లు..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి సాగునీరందించారు. అదేవిధంగా వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అందించడంతో బోరు బావుల కింద ఏటా రెండు పంటలు సాగు చేసుకున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. తెలంగాణకు ముందు కరెంట్ కోసం బోరు బావుల వద్ద రేయింబవళ్లు ఎలా పడిగాపులు గాసామో ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడింది. పదేండ్లలో ఎక్కడా రైతుల మోటర్లు కాలిపోయిన ఘటనలు లేవు. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఇస్తున్న హెచ్చుతగ్గుల కరెంట్‌తో మోటర్లు కాలిపోతున్నాయి.

*- రవి, రైతు, చంద్రకల్, పెద్దకొత్తపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

### రైతులంటే చిన్నచూపు..



కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డికి రైతులంటే చిన్నచూపు అయ్యింది. కేసీఆర్ హయాంలో మాకు రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక వానకాలం సీజన్ ప్రారంభమైనా నేటికీ రైతుబంధు ఇయ్యలే. రైతుబీమా ఉందో.. లేదో.. అర్థమైతలేదు. ఉచిత కరెంట్ ఎన్నిగంటలిస్తున్నరో ఆ డిపార్ట్‌మెంటోళ్లకే తెల్వదు. దీన్ని బట్టే రైతులపై రేవంత్‌రెడ్డికి ఎంత ప్రేమ ఉందో అర్థమైతుంది. కేసీఆర్ సారు మాకు న్యాయం చేస్తే.. రేవంత్‌రెడ్డి వచ్చి ముంచుతున్నడు.

*- సంద బాలనర్సింహులు, రైతు, ధన్వాడ గ్రామం, నారాయణపేట జిల్లా*

### ఏ పనీ చేసుకోలేకపోతున్నం..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కరెంట్ ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు వీలైనప్పుడల్లా పొలానికి వెళ్లి నీరు పారవెట్టేటోళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాతరోజులొచ్చినట్టయ్యింది. సమయపాలన లేకుండా కరెంట్ కోత విధిస్తుండడంతో పొలాలకు నీరు పారవెట్టేందుకు బోర్ల వద్ద కావలి కాస్తున్నం. కరెంట్ వచ్చే వరకు మోటర్ దగ్గరే పడిగాపులు కాస్తున్నాం. నీరు పారవెట్టేందుకు పొలం కాడనే ఉండాల్సి వస్తుంది. ఏ పనీ చేసుకోలేకపోతున్నం. 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నమని చెబుతున్నరు కానీ.. కరెంట్ సక్రమంగా ఉంటలేదు. కొద్దిపాటి వర్షం పడినా ఇండ్లలోని కరెంటును కూడా బంద్ చేస్తున్నరు. ఈ ప్రభుత్వ పనితీరు చూస్తుంటే మళ్లీ పదేండ్ల కిందటి రోజులు గుర్తొస్తున్నయ్.

*- కృష్ణ, రైతు, అల్లీపూర్, బిజినేపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు


## ఆపదొస్తే అండగా ఉంటా..

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 23 : అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఆపదొస్తే అండగా నిలుస్తానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్లు పొందిన లబ్ధిదారుల ఆహ్వానం మేరకు నిరంజన్‌రెడ్డి ఆదివారం వారి ఇండ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమ ఆర్థిక పరిస్థితులను గుర్తించి తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన నిరంజన్‌రెడ్డికి లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేసినా.. బడుగు, బలహీన వర్గాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చానన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు ఫాజల్ కుమార్తె జన్మదిన వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అశోక్, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

***వైద్యులకు పరామర్శ..***

గుండెపోటుకు చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులైన ప్రజా వైద్యశాల నిర్వాహకుడు మురళీధర్, రమేశ్‌బాబును మాజీ మంత్రి పరామర్శించారు. కొన్నేండ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని, రానున్న కాలంలో మరింత ఆరోగ్యంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.



జటప్రోల్ సమీపంలోని వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటకుల సందడి

## జటప్రోల్ కత్వకు పర్యాటక శోభ

పెంట్లవెల్లి, జూన్ 23 : మండలంలోని జటప్రోల్ సమీపంలో ఉన్న వాటర్ ఫాల్స్‌కు పర్యాటకుల సందడి మొదలైంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల వారు, సోమశిలకు వచ్చిన పర్యాటకులు సైతం జటప్రోల్ వాటర్ ఫాల్స్‌ను సందర్శించి సందడిగా గడుపుతున్నారు. జటప్రోల్ సమీపంలోని కృష్ణానది తీరాన 400 ఏండ్ల కిందట సురభిరాజులు నిర్మించిన వంతెన ప్రస్తుతం వాటర్‌ఫాల్స్‌గా మారి పర్యాటకులను కనువిందు చేస్తున్నది. సమీపంలోనే శిల్పసంపదకు ప్రతి రూపమైన శ్రీ మదనగోపాలస్వామి ఆలయం, ఆ పక్కనే అగస్త్యేశ్వరస్వామి ఆలయం, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మాసుంబాబా, హజ్రత్ దర్వేశ్‌ఖాద్రీ దర్గాలున్నాయి. అదేవిధంగా పర్యాటకులు బస చేయడానికి గ్రామంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత హోటల్‌ను సైతం నిర్మించారు. జటప్రోల్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- కొలిక్కి రాని శ్రీధర్‌రెడ్డి హత్య కేసు
- నెల రోజులైనా లభించని నిందితుల ఆచూకీ
- పోలీసులకు సవాల్‌గా మారిన దర్యాప్తు
- నిశ్శబ్దపు నీడలో లక్ష్మీపల్లి



హత్య సంఘటనపై విచారణ చేస్తున్న సీఐ నాగభూషణ్‌రావు (ఫైల్)

## వీడని మిస్టరీ..

### హంతకులను పట్టుకుంటాం

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో హంతకులను కచ్చితంగా పట్టుకుంటాం. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. అనుమానితులందరినీ పిలిపించి విచారణ జరుపుతున్నాం. ఇంకా కొందరిని చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను తప్పకుండా పట్టుకుంటాం. నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నాం. ఈ కేసు త్వరలోనే కొలిక్కి వస్తుందని ఆశిస్తున్నాం.

*- నాగభూషణ్‌రావు, సీఐ, వనపర్తి*

వనపర్తి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య ఇంకా కొలిక్కి రాలేదు. ఘటన జరిగి నెల రోజులు గడిచినా నిందితుల ఆచూకీ మాత్రం లభించలేదు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. దీంతో రాష్ట్రస్థాయిలో శ్రీధర్‌రెడ్డి హత్య పెను సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో దాడులు, హత్యల పరంపర కొనసాగుతుందని బీఆర్‌ఎస్, అలాంటిదేమీ లేదని అధికార కాంగ్రెస్ పార్టీలు మాటల యుద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే.

లక్ష్మీపల్లిలో మే 22న అర్ధరాత్రి ఇంటిపక్కనున్న కల్లందొడ్డిలో నిద్రిస్తున్న శ్రీధర్‌రెడ్డి హత్యకు గురయ్యాడు. ఎలాంటి రాజకీయ పదవిలో లేకపోవడం, వివాదాలకు దూరంగా ఉండే శ్రీధర్‌రెడ్డి హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఘటన జరిగినప్పటి నుంచి పోలీసులు 5 బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. రాజకీయ నేతలు, కుటుంబసభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పక్కా ప్రణాళికతో చేసిన ఈ హత్యలో ఎలాంటి ఆధారాలు లభించక పోలీసులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఘటనాస్థలంలో ఎలాంటి ఆనవాళ్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, డాగ్ స్క్వాడ్ పరిశీలనలోనూ బహిరంగంగా కనిపించేంత సాక్ష్యాలు లభించలేదు. దీంతో ఇంకా ఎంతకాలం దర్యాప్తు చేస్తారోనన్న చర్చ నడుస్తున్నది.

***విచారణలో అనుమానితులు..***


హత్యా ఘటనలో అనుమానితులందరినీ పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామస్తులతోపాటు పక్క గ్రామాలకు చెందిన దాదాపు 30 మందిని విచారించినట్లు అనధికార సమాచారం. స్నేహితులు, రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీలు, ఆర్థికపరమైన సంబంధాలు, రాజకీయ ప్రత్యర్థులు, అనుమానిత మహిళలతో ఉన్న అంశాలపైనా పోలీసులు నిఘా పెట్టి విచారణ చేస్తున్నట్లు సమాచారం. కేసును సీరియస్‌గా పరిశీలిస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో సమాచారం లభించకపోవడంతో మరింత లోతుగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. శ్రీధర్‌రెడ్డితో సహా అనుమానితుల ఫోన్లను పరిగణలోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు. హత్య జరిగిన మరుసటి రోజు ఎస్పీ రక్షితామూర్తి గ్రామాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. నెల రోజులుగా పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నా నిందితుల జాడ మాత్రం తెలియకపోవడం శోచనీయం.

ఈ హత్యతో లక్ష్మీపల్లి గ్రామం కొన్ని రోజుల వరకు భయం గుప్పిట్లో గడిపింది. ఆ ఊరిపై పోలీసులు పక్షం రోజులపాటు ప్రత్యేక నిఘా ఉంచారు. హత్యకు రాజకీయ మరకలు అంటుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఖాకీలు అలర్ట్ అయ్యారు. ప్రస్తుతం వారు గ్రామానికి వచ్చి అవసరమైన వారితో మాట్లాడి వెళ్తున్నారు. వానకాలంలో ప్రజలు సేద్యం పనుల్లో బిజీగా గడుపుతున్నారు. అయితే, శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిందెవరు? ఎందుకు చేశారు? అన్న ప్రశ్నలు వేధిస్తున్నా.. సమాధానం, నిందితుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

## కోయిల్‌సాగర్‌కు కృష్ణా జలాలు

- ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర, జూన్ 23 : జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్‌కు రెండ్రోజులుగా కృష్ణా జలాలు చేరుతున్నాయి. ఫలితంగా ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. రెండ్రోజుల కిందట మరికల్ మండలం తీలేరు పంప్‌హౌస్ నుంచి రెండు మోటర్ల ద్వారా 315 క్యూసెకుల నీటిని కోయిల్‌సాగర్‌కు నారాయణపేట ఎమ్మెల్యే విడుదల చేశారు. దీంతో కాల్వల ద్వారా కృష్ణమ్మ పరుగులు పెడుతూ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం నాటికి 13.1 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్ట్ జలకళను సంతరించుకున్నది. కృష్ణాజలాలు వచ్చి చేరుతుండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాల్వలో కోయిల్‌సాగర్ వైపునకు పరుగులిడుతున్న కృష్ణాజలాలు

## ఆర్డీఎస్‌కు తగ్గిన వరద

అయిజ, జూన్ 23 : ఆర్డీఎస్ ఆనకట్టకు ఆదివారం ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్ ఫ్లో 168 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతోందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 7.8 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

***తుంగభద్ర డ్యాంకు..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 620 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,957 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం నిల్వ సామర్థ్యం 100.855 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.462 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## నిడుగుర్తి వాసికి బంగారు పతకం

- అంతర్జాతీయ పరుగు పోటీలో ఘనత

ఊట్కూర్, జూన్ 23 : అంతర్జాతీయ పరుగు పోటీలో నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామానికి చెందిన గణేశ్ ప్రతిభ చాటి బంగారు పతకం సాధించాడు. యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-20 పరుగు పందెం పోటీలను నేపాల్ పోక్రా స్టేడియంలో ఈనెల 20నుంచి 24వరకు నిర్వహించారు. 400 మీటర్ల పరుగు పోటీలో పాల్గొన్న గణేశ్ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.



బంగారు పతకం అందుకుంటున్న గణేశ్


రెండవ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నాగర్‌కర్నూల్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజల ఆదరాభిమానాలతో మూడవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా నాలుగు రోజుల పాటు
(తేది:24-06-2024 నుండి 27-06-2024 వరకు, ఉ॥ 10-00గం॥ల నుండి మ॥ గం॥1-30 ని॥ల వరకు)
ఉచితంగా కన్సల్టేషన్
ఈ సదావకాశాన్ని సద్వినియోగపరుచుకోగలరని మనవి.
డా॥ రాజ్‌భూషన్ BDS, MDS అసిస్టెంట్ ప్రొఫెసర్
డా॥ మౌనిక BDS, FICD, కాస్మెటిక్ డెంటల్ సర్జన్
మా ప్రత్యేకతలు :
- రోటరీ విధానం ద్వారా రూట్ కెనాల్ చికిత్స
- ఎత్తు మరియు వంకర పళ్ళు సరిచేయుట
- లేజర్ ట్రీట్‌మెంట్ ద్వారా చిగుళ్ళ సమస్యలకు చికిత్స
- దంతాలు లేని వారికి పూర్తి కట్టుడు పళ్ళు పెట్టుట
- ఇంప్లాంట్ ద్వారా దవడ ఎముక నందు పర్మినెంట్ పళ్ళు అమర్చుట
- డిజిటల్ ఎక్స్-రే
చంద్రకళ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల
టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ / లహరి గార్డెన్ ఎదురుగా, నాగర్‌కర్నూల్.
సెల్: 9908223608, 9618260926